ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 1 | సంచిక: 340 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 16 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



ఆధ్యాత్మిక సమ్మేళన ప్రారంభోత్సవ కార్యక్రమం కోసం హైదరాబాద్ చేరుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ముఖ్యమంత్రి సాదర స్వాగతం పలికారు. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్, ఉపముఖ్యమంత్రి, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

# కవిత అరెస్ట్

## ఢిల్లీకి తరలింపు

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సంచలనం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కవితకు అరెస్ట్ వారెంట్ ఇచ్చిన అధికారులు.. ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేసి అరెస్ట్ చేశారు. అయితే.. మధ్యాహ్నం నుంచి సుమారు 5 గంటల పాటు ఆమె నివాసంలో సోదాలు నిర్వహించిన అధికారులు ఆమె ఫోన్లను సీజ్ చేసినట్టు సమాచారం.



హైదరాబాద్, మార్చి 15 (ప్రభాత ఉదయం): ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కవితను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. కొన్నిగంటల పాటు కవిత నివాసంలో సోదాలు చేపట్టిన ఈడీ అధికారులు.. ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు తరలించారు. రాత్రి 8:45 గంటల ఫ్లైట్‌కు టికెట్లు బుక్ చేసిన ఈడీ.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కవితను ఢిల్లీకి తీసుకెళ్లారు. ఈడీ సోదాలపై కవిత లాయర్ సోమా భరత్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పు వచ్చే వరకు ఎలాంటి చర్యలు ఉండవన్న ఈడీ.. ఇలా సోదాలు చేయడం సరికాదన్నారు. కోర్టులో కేసు ఉండగా సడెన్‌గా సోదాలు జరపడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసు తీవ్ర సంచలనం రేపుతోంది. ఈ కేసులో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలంగాణ ఎమ్మెల్సీ కవితకు మరింత ఉచ్చు బిగించింది. శుక్రవారం హైదరాబాద్‌కు ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు (ఈడీ) కవిత ఇంట్లో

..మిగతా 2లో



## సుప్రీంకోర్టులో కవిత ఛాలెంజ్ పిటిషన్

నేడు ఉదయం కవితకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా ఈడీ కార్యాలయానికి తరలించారు. నేడు మధ్యాహ్నం రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చనున్నారు. రాత్రంత ఢిల్లీ ఈడీ కార్యాలయంలోనే కవిత ఉండనున్నారు. కాగా, తన అరెస్ట్‌ను సవాల్ చేస్తూ నేడు సుప్రీంకోర్టులో కవిత ఛాలెంజ్ పిటిషన్ వేయనున్నట్లు సమాచారం. మరోవైపు, కవిత భర్త అనిల్ ఢిల్లీకి వెళ్లారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగంగానే తనని అరెస్ట్ చేశారని కవిత ఆరోపించారు. న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు.

## రాజకీయ కుట్ర: హరీష్‌రావు



కుట్రతోనే కవితను అరెస్ట్ చేశారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. అంతా పథకం ప్రకారమే జరిగిందని.. ఈ కేసును న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు. సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తామన్నారు. కవిత అరెస్ట్ అనంతరం బీఆర్ఎస్ నేతలు మీడియా సమావేశంలో మాట్లాడారు. కవితను అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని హరీష్‌రావు అన్నారు. 19కి కేసు విచారణ ఉన్నప్పటికి ఇవాళ అరెస్ట్ చేశారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌ను దెబ్బతీయాలన్నదే ప్లాన్. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ రాజకీయ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. "మాది ఉద్యమ పార్టీ అరెస్టులు, కేసులు కొత్త కాదు. రేపు అన్ని నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతాం. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై ఇలాంటి కుట్రలు చేస్తున్నాయి" అని హరీష్‌రావు ధ్వజమెత్తారు.



# నేడే ఎన్నికల షెడ్యూల్ ప్రకటన

2లో..

## అధికారికంగా ప్రకటించిన ఈసీ

## అన్ని రంగాల్లో ముస్లిం మైనారిటీలకు సముచిత స్థానం: సీఎం రేవంత్ రెడ్డి



ముస్లిం సోదరులకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఎంపీ అసదుద్దీన్ కు ఖర్జూర పండును తినిపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 15(ప్రభాత ఉదయం)కాంగ్రెస్ హయాంలో ముస్లిం మైనారిటీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు.ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. "ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌లు రద్దు చేయడం ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వల్ల కాదు. రిజర్వేషన్లు అమలు జరిగేలా చూసే బాధ్యత మాది. మైనారిటీ స్కూళ్లకు భవనాల కోసం ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసింది" అని రేవంత్ తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ అసదుద్దీన్, షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిరిలో మోదీ రోడ్ షో



## భారీగా తరలివచ్చిన అభిమానులు

హైదరాబాద్, మార్చి 15 (ప్రభాత ఉదయం): ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ కు చేరుకున్నారు. మల్కాజ్ గిరి లోక్ సభ బీజేపీ అభ్యర్థి కోసం ఆయన రోడ్ షో నిర్వహించారు. దీనికి భారీ స్పందన లభించింది. లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్నాయి. నేడు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేస్తుందని ప్రకటించింది. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ప్రధాని నరేంద్ర మోడీ కూడా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం ఆయన హైదరాబాద్‌కు చేరుకున్నారు. మాల్కాజ్‌గిరిలో బీజేపీ అభ్యర్థి విజయం కోసం రోడ్ షోలో పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం ఈ రోడ్ షో ప్రారంభమైంది. దీనికి భారీ స్పందన లభించింది. రోడ్ షోకు ఇరు వైపుల భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈ రోడ్ షో మీర్జాలగూడ నుంచి మల్కాజ్ గిరి క్రాస్ రోడ్ వరకు సాగింది. ప్రధాని మోడీని చూసేందుకు జనాలు ఎగబడ్డారు. ప్రధాని ఉన్న వాహనంపై బీజేపీ తెలంగాణ చీఫ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఉన్నారు. 1.2 కిలో మీటర్లు సాగిన ఈ రోడ్ షోకు సుమారు గంట సమయం పట్టింది. ఈ రోడ్ షో అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ రాజ్ భవన్ కు వెళ్లారు.





ఈ నెల 20 తేదీ నుండి ప్రారంభం కానున్న ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ప్రభుత్వ విప్ ధర్మపురి నియోజకవర్గ శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారితో కలిసి ఆలయ ఈవో శ్రీనివాస్, మరియు అర్చకులు ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దినేష్ గారు గురువారం రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కలిసి వారికి అందించి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు..

## బీజేపీకి రాజీనామా చేసి

# కాంగ్రెస్‌లో చేరిన జితేందర్ రెడ్డి

## వెంటనే కీలక పదవి, ఉత్తర్వులు జారీ



హైదరాబాద్, మార్చి 15 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికల వేళ మహబూబ్ నగర్ మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి బీజేపీకి షాకిచ్చారు. బీజేపీకి రాజీనామా చేసిన జితేందర్ రెడ్డి తాజాగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇంఛార్జ్ దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. మహబూబ్ నగర్ ఎంపీ సీటు ఆశించి భంగపడ్డ జితేందర్ రెడ్డి కాషాయ పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. డీకే అరుణకు బీజేపీ అధిష్టానం ఛాన్స్ ఇవ్వడంతో కాంగ్రెస్ లో

..మిగతా 2లో

# కవిత అరెస్ట్

మొదటి పేజీ తరువాయి...

సోదాలు నిర్వహించి సాయంత్రం కవితను అరెస్టు చేశారు. అరెస్ట్‌పై కవిత ఇంటి వద్ద కార్యకర్తలు ఆందోళనకు దిగారు. అయితే కవితను అరెస్ట్ చేయడంపై పొలిటికల్ లీడర్స్ పలు రకాలగా రియక్షన్ ఇస్తున్నారు. కవితకు సంబంధించిన కేసు అంశం సుప్రీంకోర్టులో ఉండగా ఆమెను అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి. అలాగే కవిత విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతోందన్నని బీజేపీ నేత ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. అలాగే ఈ అంశానికి బీజేపీతో ఎలాంటి సంబంధం లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, కవిత అరెస్ట్‌పై తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. ఎమ్మెల్సీ కవితను ఎప్పుడో అరెస్టు చేయాల్సి ఉందని, రాజకీయ లబ్ది కోసమే బీజేపీ ఎన్నికల ముందు కవితను అరెస్ట్ చేసిందంటూ వ్యాఖ్యానించారు. ఇంతకాలం కవితను బీజేపీ ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. కవిత అరెస్టుతో ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో రాష్ట్రంలో మూడో నాలుగో స్థానాలను గెలవచ్చని బీజేపీ ఆశ పడుతోందని, బీజేపీ, బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్.. గల్లీల కొట్లాట ఢిల్లీలో దోస్తీ అంటూ కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. లక్షల కోట్ల అవినీతి పాల్పడిన కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ చెబుతుందన్నారు. మరికొన్ని గంటల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతున్న సమయంలో కవితను అరెస్ట్ చేయడంపై సందేహాలు వ్యక్తం చేశారు. ఇది మ్యాచ్ ఫిక్సింగ్ కావొచ్చన్నారు.

## కవిత అరెస్ట్‌కు.. అమిత్ అరోరా కీలకం

**లిక్కర్ స్కామ్ కేసులో నిందితుడిగా ఉన్న అమిత్ అరోరాను నాలుగు రోజుల నుంచి ఈడీ ప్రశ్నిస్తోంది.కేసుకు సంబంధించిన కీలక సమాచారాన్ని ఈడీ అధికారులకు అమిత్ అరోరా ఇచ్చారు.అమిత్ అరోరా ఇచ్చిన సమాచారం మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు.**



## అధికారులతో కేటీఆర్ గొడవ

కవిత ఇంట్లోకి వెళ్లిన కేటీఆర్, హరీశ్.. ఈడీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ట్రాన్సిట్ వారెంట్ లేకుండా కవితను ఎలా అరెస్ట్ చేస్తారని కేటీఆర్ ప్రశ్నించారు. కనీసం తమ న్యాయవాదినైనా అనుమతించాలి కదా అని వాదించారు. అధికారులు వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. దీంతో ఏం జరుగుతుందనేది ఉత్కంఠగా మారింది.

## మాజీ మంత్రి కేటీఆర్ పై కేసు నమోదు

**బీఆర్ఎస్ నేత,మాజీ మంత్రి కేటీఆర్ పై కేసు నమోదైంది.ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ,తన సోదరి కవిత అరెస్ట్ సందర్భంగా తమపై కేటీఆర్ దౌర్జన్యం చేశారని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో ఈడీ అధికారులు ఫిర్యాదు చేశారు.ఈ ఘటనపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.**

## రోడ్లపైకి బీఆర్ఎస్ శ్రేణులు.. టెన్షన్ టెన్షన్!

### కవిత నివాసానికి చేరుకున్న కేటీఆర్, హరీశ్ రావు

హైదరాబాద్, మార్చి 15 (ప్రభాత ఉదయం): తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కవిత అరెస్టుతో ఆ పార్టీ శ్రేణులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. అరెస్ట్ వ్యతిరేకిస్తూ పార్టీ శ్రేణులు రోడ్లపైకి వచ్చాయి. ఇప్పటికే కవిత నివాసం ముందు బీఆర్ఎస్ శ్రేణులు నిరసనకు దిగాయి. ఇక కవిత అరెస్ట్ వార్తను తెలుసుకున్న గులాబీ పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కవిత అరెస్ట్ అక్రమమంటూ మండిపడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కవిత అరెస్ట్ వార్త తెలుసుకున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కవిత నివాసానికి చేరుకున్నారు. ఆయన వెంటనే మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు పలువురు కీలక నేతలు ఉన్నారు. మరోవైపు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ కవిత నివాసానికి చేరుకుంటున్నాయి.

**ఉదయం నుంచి ఇలా..!**

వాస్తవానికి కవితను ఏ క్షణమైనా అరెస్ట్ చేస్తారని మధ్యాహ్నం నుంచే టాక్ నడుస్తూ వచ్చింది. కవిత ఇంట్లో అధికారుల సోదాలు.. ఇంటి బయట పోలీసులు భారీగా మోహరించడంతోనే ఇవాళ కీలక పరిణామమే జరుగుతుందని అందరూ ఊహించారు. దీనికి తోడు కవిత, ఆమె భర్త అనిల్.. సహాయకుల ఫోన్లు మొత్తం 16 ఫోన్లను స్వాధీనం చేసుకోవడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. అయితే.. తనపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టులో కవిత వేసిన పిటిషన్ మార్చి-19న విచారణ ఉండటంతో.. అంతవరకూ ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోవని బీఆర్ఎస్ వర్గాలు ధీమాతోనే ఉన్నాయి. అయితే ఉన్నట్టుండి ఢిల్లీ నుంచి ఏక కాలంలో ఈడీ, ఐటీ అధికారులు తనిఖీలు చేయడంతో ఒక్కసారిగా బీఆర్ఎస్ ఉలిక్కిపడింది. దీనిపై బీఆర్ఎస్ ఎలా రియాక్ట్ అవుతుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పుడు కాదు గతంలో ఢిల్లీ వేదికగా ఈడీ విచారణ జరిగినప్పుడే అరెస్ట్ చేయాల్సింది,.. ఆలస్యమైందంటూ కాంగ్రెస్ నేతలు సెటైర్లేస్తున్నారు. ఇక బీజేపీ నేతలు మాత్రం కచ్చితంగా అరెస్ట్ ఉంటుందన్నట్లుగా చెబుతూ వస్తున్నారు..



## బీఆర్ఎస్‌కు మరో ఎదురు దెబ్బ

### సీఎం రేవంత్‌ని కలిసిన ఎంపీ పసునూరి

హైదరాబాద్, మార్చి 15 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు తగులుగుతున్నాయి. ఇప్పటికే పలువురు ఎంపీలు, కీలక నేతలు పార్టీని వీడగా, తాజాగా వరంగల్ ఎంపీ పసూరి దయాకర్ అదే బాటలో నడుస్తున్నారు. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. వరంగల్ లోక్ సభ టికెట్ దక్కకపోవడంతో ఆయన అసంతృప్తితో ఉన్నారు. త్వరలో కాంగ్రెస్‌లో చేరుతారని సమచారం ఉంది. కాగా చేవేళ్ల, బీఆర్ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా హస్తం గూటికి చేరుతారని టాక్. దయాకర్ వరంగల్ నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచారు. మొదటిసారి 2015 లోక్ సభ ఉప ఎన్నికల్లో, ఆ తర్వాత 2019లో మరోసారి విజయం సాధించారు. కానీ వరంగల్ సీటును ఈసారి కడియం కావ్యకు కేటాయించడంపై దయాకర్ అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలో ఆయన రేవంత్ రెడ్డిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ నాయకురాలు, మంత్రి కొండా సురేఖ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో ఉన్నారు. ఆయన త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరుతారని ప్రచారం సాగుతోంది.

## నేడే ఎన్నికల షెడ్యూల్ ప్రకటన

హైదరాబాద్, మార్చి 15 (ప్రభాత ఉదయం): దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల సందడి మొదలైంది. ఈసీకి శుక్రవారం ఇద్దరు నూతన ఎన్నికల కమిషనర్ల నియామకం జరిగింది. ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ సమక్షంలో జ్ఞానేష్ కుమార్, డాక్టర్ సుఖ్ బీర్ సింగ్ సంధు ఎన్నికల కమిషనర్లుగా బాధ్యతలు చేపట్టారు. సీఈసీ రాజీవ్ కుమార్ వాళ్లకు అభినందనలు తెలియజేశారు. అనంతరం సీఈసీ అధ్యక్షతన ఈ ముగ్గురు భేటీ అయ్యారు..ఈ భేటీలోనే ఎన్నికల షెడ్యూల్ ప్రకటనపైన క్లారిటీ ఇచ్చారు.. శనివారం (16 మార్చి) సార్వత్రిక ఎన్నికల తేదీలు ప్రకటన చేయనుంది సీఈసీ. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సీఈసీ ప్రెస్‌మీట్ పెట్టి లోక్‌సభ, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేయనుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ శనివారం విడుదల కానుంది..లోక్‌సభతో పాటు ఐదు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలను నిర్వహించేందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శనివారం విడుదల చేసేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధమైంది.. ఇటీవల దేశంలోని పలు రాష్ట్రాల్లో పర్యటించిన కేంద్ర ఎన్నికల సంఘం టీమ్ ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించింది. మొత్తం 7 విడతల్లో లోక్‌సభ ఎన్నికలను నిర్వహించేందుకు ఈసీ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ పోల్స్ జరిగే అవకాశమున్న రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ ఉన్నాయి..

## పొత్తు ఖరారు.. బీస్పీకి రెండు సీట్లు కేటాయించిన కేసీఆర్

హైదరాబాద్, మార్చి 15(ప్రభాత ఉదయం) పార్లమెంట్ ఎన్నికల వేళ తెలంగాణలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు ఖరారు అయింది. పొత్తులో భాగంగా బీఆర్ఎస్ 15 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తుండగా.బీఎస్పీకి రెండు సీట్లు కేటాయించింది. హైదరాబాద్, నాగర్ కర్నూలు నియోజకవర్గాల్లో బీఎస్పీ అభ్యర్థులు పోటీ చేయనున్నారు. కాగా,



అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి చేదు అనుభవం ఎదురైన విషయం తెలిసిందే. రాష్ట్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న ఆ పార్టీని ప్రజలు ఓడించారు. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లోనైనా సత్తా చాటాలని భావిస్తోంది. మొత్తం 17 స్థానాలకు గాను మెజార్టీ స్థానాలు దక్కించుకోవాలని వ్యూహాలు రచిస్తోంది. అందులో భాగంగా బహుజన్ సమాజ్ పార్టీ తో పొత్తుకు ఓకే చెప్పింది. వారం రోజుల క్రితమే ఈ రెండు పార్టీల మధ్య పొత్తు కుదరగా.. సీట్ల షేరింగ్‌పై ఇవాళ క్లారిటీ ఇచ్చారు. నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది.



## 'కొత్త ఈసీల నియామకాలపై స్టే విధించలేం': సుప్రీం

న్యూఢిల్లీ, మార్చి 15 (ప్రభాత ఉదయం): పదవీ విరమణ చేసిన మాజీ ఉన్నతాధికారులు జ్ఞానేష్‌కుమార్, సుఖ్బీర్‌సింగ్ సంధు కేంద్ర ఎన్నికల కమిషనర్లుగా ఎంపికైన సంగతి తెలిసిందే. వారి నియామకాన్ని తాత్కాలికంగా నిలిపివేసేందుకు శుక్రవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. ఎన్నికల సంఘం(ఈసీ)లో ఖాళీ అయిన రెండు కమిషనర్ పోస్టుల భర్తీకి ఎంపిక కమిటీలో సీజేఐను మినహాయించడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. కొత్త కమిషనర్ల నియామకాన్ని 'ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం-2023' ప్రకారం చేపట్టకుండా కేంద్రాన్ని అడ్డుకోవాలని పిటిషనర్లు కోరారు. దీనిపై వచ్చేవారం (మార్చి 21న) విచారణ జరుపుతామని వెల్లడించింది. గత డిసెంబర్‌లో కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. ఎంపిక కమిటీలో సీజేఐకు బదులుగా ప్రధాని సూచించిన కేంద్రమంత్రిని చేర్చింది. ఈ కొత్త చట్టాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఎన్నికల కమిషనర్ అరుణ్‌గోయల్ ఈనెల 8న రాజీనామా చేయడం, మరో కమిషనర్ అనూప్‌చంద్ర పాండే కాలపరిమితి ఫిబ్రవరి 14న ముగియడంతో ఎన్నికల సంఘంలో ఏర్పడిన రెండు ఖాళీలను కేంద్ర ప్రభుత్వం జ్ఞానేష్, సుఖ్బీర్‌తో భర్తీ చేసింది. ఈ ఇద్దరు మాజీ ఐఏఎస్‌ల పేర్లకు ప్రధాని మోదీ నేతృత్వంలోని కమిటీ గురువారం ఆమోదం తెలిపింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధీర్ రంజన్‌చౌధరి సభ్యులుగా ఉన్న ఈ కమిటీ నిన్న దిల్లీలో సమావేశమైంది. అనంతరం ఇద్దరు కొత్త కమిషనర్ల నియామకంపై కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.

## అసంపూర్తిగా ఎలక్టోరల్ బాండ్స్ వివరాలు

హైదరాబాద్, మార్చి 15 (ప్రభాత ఉదయం): ఎలక్టోరల్ బాండ్స్ కేసులో మరోసారి సుప్రీంకోర్టు SBIపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. బాండ్ల వివరాలు పూర్తి స్థాయిలో వెల్లడించలేదని మండి పడింది. గడువులోగా వివరాలు ఇవ్వలేదని ఇప్పటికే ఓ సారి SBIపై ఫైర్ అయింది సుప్రీంకోర్టు. ఆ వెంటనే SBI అప్రమత్తమై ఎలక్టోరల్ బాండ్స్ వివరాలు ఎన్నికల సంఘానికి సమర్పించింది. అయితే...ఇప్పుడీ వివరాలపై సర్వోన్నత న్యాయస్థానం సంతృప్తి చెందలేదు. ఎన్నికల సంఘం వేసిన పిటిషన్ని విచారించిన సమయంలో ధర్మాసనం SBI ఇచ్చిన వివరాలు అసంపూర్తిగా ఉన్నాయని స్పష్టం చేసింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఈ పిటిషన్పై విచారణ చేపట్టింది. ఎలక్టోరల్ బాండ్స్ సంఖ్యని కూడా వెల్లడించాలని తేల్చి చెప్పింది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు SBIకి నోటీసులు జారీ చేసింది. వివరాలు అసంపూర్తిగా ఎందుకిచ్చారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. మార్చి 18వ తేదీన మరోసారి దీనిపై విచారణ చేపట్టనున్నట్టు వెల్లడించింది. ఎవరెవరు విరాళాలు ఇచ్చారు..? ఏయే పార్టీలకు ఇచ్చారు..? అనే వివరాలు తెలియాలంటే కచ్చితంగా ఎన్ని ఎలక్టోరల్ బాండ్స్ విక్రయించారో చెప్పాలని కోర్టు స్పష్టం చేస్తోంది. జూన్ 30వ తేదీ వరకూ గడువు ఇవ్వాలని, ఆలోగా పూర్తి వివరాలు వెల్లడిస్తామని SBI సుప్రీంకోర్టుకి విజ్ఞప్తి చేసింది. అయితే...మార్చి 11వ తేదీన ఈ పిటిషన్ని కొట్టివేసింది సుప్రీంకోర్టు. గడువు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. ఈ తీర్పులో కొన్ని మార్పులు చేర్పులు చేయాలని కోరుతూ ఎన్నికల సంఘం మరో పిటిషన్ వేసింది. ఇప్పుడీ పిటిషన్ని విచారిస్తూనే SBIపై మరోసారి అసహనం వ్యక్తం చేసింది. ఇప్పటి వరకూ కోర్టులో సమర్పించిన బాండ్స్ వివరాలను వెనక్కి ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అయితే...ఈ వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలించాలని సుప్రీంకోర్టు జ్యుడీషియల్ రిజిస్ట్రార్ని ఆదేశించింది. అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టు వ్యాఖ్యల్ని వివరించారు. ఆల్ఫాన్యూమరిక్ నంబర్ని చేర్చకుండానే SBI వివరాలు ఇచ్చిందని కోర్టు అసహనం వ్యక్తం చేసినట్టు వెల్లడించారు.

## బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన జితేందర్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి...

చేరాలని నిర్ణయం తీసుకున్న ఆయన.. బీజేపీని వీడి కుమారుడు మిథున్ రెడిలో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇటీవల జితేందర్ రెడ్డి ఇంటికి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానించడంతో హస్తం గూటికి చేరుకున్నారు. కాంగ్రెస్ లో చేరిన కొన్ని గంటల్లోనే ఆయనను కీలక పదవి వరించింది. మాజీ ఎంపీ జితేందర్ రెడ్డిని న్యూఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా (క్రీడా వ్యవహారాలు) రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం రాత్రి జారీ చేశారు. మల్లు రవి ఇటీవల ఆ పదవికి రాజీనామా చేయడం తెలిసిందే. దాంతో పార్టీలో చేరిన వెంటనే పాలమూరు జిల్లాకే చెందిన మరోనేత జితేందర్ రెడ్డికి తెలంగాణ ప్రభుత్వం పదవి ఇచ్చింది. క్యాబినెట్ ర్యాంక్‌తో తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారుడిగా జితేందర్ రెడ్డి నియమితులయ్యారు. 2019 ఎన్నికల సమయంలో జితేందర్ రెడ్డికి అప్పటి సీఎం కేసీఆర్ టిక్కెట్ నిరాకరించారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న ఆయనకు టిక్కెట్ ఇవ్వకపోవడంతో వెంటనే బీజేపీలో చేరారు. బీజేపీ అప్పటికే డీకే అరుణకు టిక్కెట్ ఖరారు చేసింది. దీంతో ఆయన ఎన్నికల్లో పోటీ చేయకుండా డీకే అరుణ కోసం ప్రచారం చేశారు. స్వల్ప తేడాతో డీకే అరుణ ఓడిపోయారు. అయితే ఆ తర్వాత ఎంపీ టిక్కెట్ కోసం ఇద్దరు నేతలు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఒకరిని అసెంబ్లీకి పోటీ చేయించేందుకు హైకమాండ్ ప్రయత్నించింది. కానీ ఇద్దరూ పోటీ చేయలేదు. మహబూబ్ నగర్ అసెంబ్లీ స్థానం నుంచి జితేందర్ రెడ్డి కుమారుడు మిథున్ రెడ్డికి చాన్సిచ్చారు. ఆయన ఓటమిచెందారు. ఈ క్రమంలో పాలమూరు ఎంపీ టిక్కెట్ కోసం కూడా జితేందర్ రెడ్డి ప్రయత్నించినా.. అధిష్టానం డీకే అరుణ వైపు మొగ్గుచూపింది. గత ఎన్నికల్లో డీకే అరుణ స్వల్ప తేడాతోనే ఓటమి చెందడంతో మరోసారి ఆమెకు ఛాన్స్ ఇచ్చింది.

## తెలుగు రాష్ట్రాల్లో నేటి నుంచి ఈనెల 21 వరకు వర్షాలు

### ఐఎండి చల్లటి కబురు


హైదరాబాద్, మార్చి 15(ప్రభాత ఉదయం ఉదయం)ఎండ వేడికి తాళలేక పోతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఐఎండి చల్లటి కబురు చెప్పింది.రేపటి నుంచి ఈనెల 21 వరకు ఏపీ,తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.ప్రస్తుతం ఇరు రాష్ట్రాల్లో పగటి ఉష్ణోగ్రతలు సుమారు 40 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి.ఉదయం నుంచే సూర్యుడు ప్రతాపం చూపుతున్నాడు.దీంతో మధ్యాహ్నం సమయంలో



అత్యవసరం అయితే తప్ప బయటికి వెళ్లొద్దని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది.

## కొడుకుకు ముద్దుపెట్టి బయల్దేరిన కవిత

హైదరాబాద్,మార్చి15 (ప్రభాత ఉదయం):మనీలాండరింగ్ చట్టం కింద కవితను అరెస్ట్ చేసిన ఈడీ అధికారులు ఆమెను ఢిల్లీకి తరలిస్తున్నారు.ఆమెను తరలిస్తున్న క్రమంలో భావోద్వేగానికి గురైన కవిత..కొడుకు నుదుటిపై ముద్దు పెట్టి..ముందుకు సాగారు. అంతకుముందు జై



తెలంగాణ అని నినదించిన ఆమె..పిడికిలి బిగించి శ్రేణులకు అభివాదం చేశారు.అనంతరం కారు ఎక్కాక భర్తను హత్తుకొని ఆమె ఉద్వేగానికి గురయ్యారు.

## కాంగ్రెస్‌లోకి దానం?

### కారు దిగి రెండోసారి సొంతగూటికి?

హైదరాబాద్, మార్చి 15 (ప్రభాత ఉదయం): లోక్ సభ ఎన్నికల ముంగిట బీఆర్ఎస్ పార్టీకి గులాబీ నేతలు షాకుల మీద షాకులు ఇస్తున్నారు. ఒకరి వెంట ఇంకొకరు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయేందుకు క్యూ కడుతున్నారు. సిట్టింగ్ ఎంపీతో మొదలైన ఈ జంపింగుల పర్వం మాజీలతో ఊపందుకుని ఇప్పుడు సిట్టింగ్ ఎమ్మెల్యేల దాకా వచ్చింది. ఈ నేపథ్యంలోనే.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సీఎం రేవంత్ రెడ్డిని కలవటం ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది. దానం మళ్లీ సొంతగూటికి చేరుకోనున్నాడా అన్న చర్చ మొదలైంది. లోక్ సభ ఎన్నికల వేళ తెలంగాణలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల సమీకరణాలు రోజు రోజుకు మారిపోతున్నాయి. ఏ నేత ఎన్నకల ఉంటాడన్నది ఎవరూ ఊహించలేకపోతున్నారు. అందులోనూ.. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న నేతలు చాలా మంది నేతలు, మాజీలు ఇప్పటికే.. కారు దిగేశారు. అందులో సిట్టింగ్ ఎంపీలు కూడా ఉండటం గమనార్హం. ఇక ఇప్పుడు సిట్టింగ్ ఎమ్మెల్యేల వంతొచ్చినట్టు కనిపిస్తోంది. ఈ క్రమంలోనే.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే, సీనియర్ నేత దానం నాగేందర్ కూడా కారు దిగి.. మళ్లీ సొంత గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నట్టుగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డితో దానం నాగేందర్ భేటీ అవటమే అందుకు కారణం. శుక్రవారం రోజున.. హైదరాబాద్‌లోని సీఎం నివాసానికి వెళ్లి దానం నాగేందర్.. మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా.. ఈ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ దీప్ దాస్ మున్షీ ఉండటం.. మరింత ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలోని పలువురు నేతలకు దానం నాగేందర్ కలవటం.. ఇప్పుటు స్వయంగా ఆయనే వెళ్లి సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అవటం ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఇందుకు సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో.. ఇక పార్టీ మార్పు ఖాయమన్న వార్తలు ఊపందుకున్నాయి. అయితే.. దానం నాగేందర్ రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ పార్టీ నుంచే మొదలైన విషయం తెలిసిందే. 1994, 1999, 2004 ఎన్నిలకల్లో.. ఆసిఫ్ నగర్ నియోజకవర్గం నుంచి వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే.. కాంగ్రెస్‌లో సీనియర్ నాయకునిగా ఉన్న దానం.. 2004లో తెలుగుదేశం పార్టీలో చేరి.. ఆ



పార్టీ తరపున బరిలో దిగి గెలిచారు. మళ్లీ ఆ తర్వాత ఆ సీటుకు రాజీనామా చేసి ఉపఎన్నికల్లో ఓడిపోయాపు. ఆ తరువాత నియోజకవర్గాల విభజన కాగా.. 2009 ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి పోటీచేసి గెలిచారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేబినెట్‌లో ఆరోగ్యశాఖ మంత్రిగా.. ఆ తర్వాత రోశయ్య మంత్రివర్గంలోనూ అదే శాఖ మంత్రిగా కొనసాగారు. ఇక.. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లోనూ ఖైరతాబాద్ నుంచి పోటీ చేసి.. ఓడిపోయారు. ఆ తర్వాత టీఆర్ఎస్‌లో చేరిపోయి.. 2018లో మళ్లీ ఖైరతాబాద్ బరిలో దిగి గెలిచారు. అయితే.. ఇప్పటికే ఓసారి టీడీపీకి వెళ్లి సొంతగూటికి చేరుకున్న దానం.. ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి మరొక్కసారి సొంత గూటికి వెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వార్తలు ప్రచారమవుతున్నాయి. మరి.. దానం ఎలాంటి నిర్ణయం తీసుకోకున్నారో చూడాలి. నిజంగానే సొంతగూటికి వెళ్తున్నారో.. లేదా అందరిలాగే నియోజకవర్గ అభివృద్ధి కోసం కలిశానని చెప్తారో చూడాలి.

# రైతు దైవంతో సమానం

బుద్వేల్, మార్చి15(ప్రభాత ఉదయం): ప్రపంచంలోని మానవాళి అంతటికీ ఆహారాన్నందించే రైతు దైవంతో సమానం అని నాబార్డ్ తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల వ్యాఖ్యానించారు. రైతాంగం స్థితిగతుల్ని మెరుగుపరిచేందుకు నాబార్డ్ నిరంతరం కృషి చేస్తుందని వివరించారు. రాజేంద్రనగర్ లోని విస్తరణ విద్యాసంస్థలో (ఈ ఈ ఐ) ఈరోజు జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మేలైన యాజమాన్య పద్ధతులు, పంటల వైవిధ్యీకరణ, సాంకేతిక పరిజ్ఞానం బదలాయింపు, విలువ జోడింపు వంటి పద్ధతులతో రైతు ఉత్పత్తిదారుల సంఘాల్ని (ఎఫ్ పీ ఓ ) బలోపేతం చేయడంపై నాబార్డు సాయంతో వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఒక ప్రాజెక్టును అమలు చేస్తుంది. అందులో భాగంగా ఈరోజు కొనుగోలుదారులు - అమ్మకం దారుల మొదటి ఇష్టాగోష్టి కార్యక్రమం ఈ ఈ ఐ లొ జరిగింది. దీనిలో సుశీల చింతల ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రోజురోజుకీ జనాభా పెరుగుతూ ఉండడంతో పాటు వారి ఆహారపు అలవాట్లు మారుతున్నాయని, కొత్త కొత్త టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్నాయని సుశీల అన్నారు. అందుకు తగ్గట్లుగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు మారాలని సూచించారు. వాటి పరిధి విస్తృతం కావాలన్నారు. ఎఫ్ పీ ఓ ల విషయంలో భవిష్యత్తులోనూ వ్యవసాయ విశ్వవిద్యాలయం కి తోడ్పాటు అందించే విషయాన్ని పరిశీలిస్తామని సుశీల చింతల ప్రకటించారు. రాబోయే రోజుల్లో ఎఫ్ పీ ఓ ల పాత్ర మరింత అధికమవుతుందని వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ వి. సుధారాణి అన్నారు. భవిష్యత్తులో ప్రతి కృషి విజ్ఞాన కేంద్రం పరిధిలోను 5 ఎఫ్ పీ ఓ లు ఉండే విధంగా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా రైతు వేదికలని వీడియో కాన్ఫరెన్స్ ల ద్వారా అనుసంధానం చేసే ప్రక్రియ ప్రారంభించిందని ఉగాదిలోగా అన్ని రైతువేదికలోనూ వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం అందుబాటులోకి వచ్చే అవకాశముందని సుధారాణి వివరించారు. రైతులు బలోపేతం అయితేనే దేశ ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తుందని వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీమ అభిప్రాయపడ్డారు. మార్కెట్ డిమాండ్ కి అనుగుణంగా వ్యవసాయ ఉత్పత్తులుండాలన్నారు. ఎఫ్ పీ ఓ లు సొంత బ్రాండ్లు అభివృద్ధి చేసుకోవాలని సీమ సూచించారు. ఎఫ్ పీ ఓ లు ముందు ముందు ఫెడరేషన్ గా అభివృద్ధి చెందాలని మేనేజ్ డైరెక్టర్ గుమ్మ గోలిమత్ అన్నారు. ఎఫ్ పీ ఓ ల ద్వారా రైతాంగానికి మార్కెట్ మెళకువలు, మార్కెట్ అనుసంధానం వంటి అంశాల్లో అవగాహన ఏర్పడుతుందని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ డాక్టర్ సి. నరేంద్ర రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆర్థిక వ్యవహారాలు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి వ్యవహారాల్లో ఎఫ్ పీ ఓ లు నిరంతరం శిక్షణ పొందాలని ఈ ఈ ఐ సంచాలకులు డాక్టర్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. సదస్సు ప్రారంభంలో నాబార్డ్ సహాయంతో నిర్వహిస్తున్న ఈ ప్రాజెక్ట్ గురించి, గత కొంతకాలంగా చేసిన కార్యక్రమాల గురించి ప్రొఫెసర్ డాక్టర్ మధుబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎవర్ గ్రీన్ ఎంటర్ ప్రైజెస్ ప్రతినిధి ప్రసాదరావు పాశం, మార్కెటింగ్ శాఖ సిబ్బంది, ఎఫ్ పీ ఓ లు, రైతులు, మహిళా రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు. డాక్టర్ రవీందర్ నాయక్ వందన సమర్పణ చేశారు.


విస్తరణ విద్యా సంస్థ లో జరిగిన కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతున్న నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ చింతల సుశీల


కాన్షీరామ్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న దళిత నాయకులు

## పేదలకు రాజ్యాధికారం కావాలని కలలుకన్న కాన్షీ రామ్

బుద్వేల్, మార్చి15(ప్రభాత ఉదయం): బడుగు బలహీన,బహుజనుల పాలన సాధకుడు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన యోధుడు మాన్యశ్రీ కాన్షిరాం అని మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ చైర్మన్ పచ్చ నర్సింగ్ రావు అన్నారు. శుక్రవారం మాన్యశ్రీ కాన్షిరాం 90 వ జయంతి రాజేంద్రనగర్ నగర్ అంబెడ్కర్ చౌరస్తా కూడలిలో మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది మహనీయుల ఆశయసాధనకోసం నిరంతరం ప్రజలను చైతన్య పరుస్తూ పేద వర్గాల అభ్యున్నతికి కృషి చేసినపుడే మహనీయుల మార్గంలో నడిచినవారం అవుతామని నర్సింగ్ రావు గుర్తు చేశారు. అపుడే నిజమైన జాతి కోసం పోరాడిన వారముగా చరిత్రలో నిలుస్తామని మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ముఖ్య సలదారులు శ్రీ వనం నర్సింహా మాదిగ, పొయిల జీవన్ దాస్ లు ఉపన్యసించారు . జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ పచ్చ నర్సింగ్ రావు ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం కోశాధికారి రగడంపల్లి శ్రవణ్ కుమార్ తో పాటు మహనీయుల కమిటీ ముఖ్య సలహాదారులు పోతురాజు యాదయ్య ,అనుముల జాన్ పాల్,మాజీ అధ్యక్షులు మంత్రి చంద్రశేఖర్, పంబల రాజు, గోల్కొండ రాజ్ కుమార్,పలుగుచెరువు మహేష్ ,జయంతి ఉత్సవాల కమిటీ నాయకుడు మంగళారం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ప్రీతం రాజు, సభ్యులు గొడుగు సంజీవ ,బచ్చల మహేష్ ,రాజు ,అదిరాల రవి కుమార్, ఎడ్లకాడి చంద్రశేఖర్, సంతోష్ గడ్డం సామెల్ ,ఏ బాబు రావు,కాసారం మహేష్ దళిత బహుజన నాయకులు షాబాద్ యాదయ్య, తెప్ప అరుణ పెంటయ్య చింటు తదితరులు నివాళులు అర్పించినవారిలో ఉన్నారు


ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం రేవంత్ రెడ్డి

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

### ఎమ్మెల్యే శంకర్ కు మంత్రులు,ఎమ్మెల్యేలు, ప్రముఖుల శుభాకాంక్షలు

షాద్ నగర్,మార్చి15(ప్రభాత ఉదయం)షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు "హ్యాపీ బర్త్ డే శంకర్" అంటూ ఆప్యాయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ సిఎం రేవంత్ రెడ్డి గృహంలో మాజీ ఎంపీ ఏపీ జితేందర్ రెడ్డి తదితరులు పార్టీ చేరిక కార్యక్రమంలో కలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు పూల బొకేతో సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.భవిష్యత్తు మంచి అభివృద్ధి సూచకంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పేద ప్రజలకు మంచి సేవ చేయాలని సూచించారు.ఈ సందర్భంగా పలువురు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి,ఎమ్మెల్యేలు వాకిట శ్రీహరి,మధుసూదన్ రెడ్డి పర్ణిక రెడ్డి,పాలమూరు ఎంపీ అభ్యర్థి వంశి చందర్ రెడ్డి,మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి మిథున్ రెడ్డి ఇతర ప్రముఖులు ఎమ్మెల్యే శంకర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.


ప్రధాని మోడీ సభకు బస్సులో వెళ్తున్న మహిళలకు నమస్కరిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## పార్లమెంట్ ఎలక్షన్లో బిజెపి రాష్ట్రంలో ఘన విజయం


### కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్, మార్చి15(ప్రభాత ఉదయం) పార్లమెంట్ ఎలక్షన్ లో బిజెపి తెలంగాణలో ఘన విజయం సాధిస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి కాంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని కట్టేధాన్ బీజేపీ పార్టీ కార్యాలయం నుంచి కేంద్ర మంత్రి రాష్ట్ర అధ్యక్షులు జి. కిషన్ రెడ్డి అధ్యక్షతన మిర్జాలగూడ నుండి మల్కాజ్గిరి %శ% రోడ్ వరకు జరగబోయే విజయ సంకల్ప రోడ్ షో లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా పాల్గొననున్న బీజేపీ కార్యకర్తలకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మైలార్ దేవుపల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు ఆడికే జనార్ధన్ సమక్షంలో భారీగా కార్యకర్తలు బయలుదేరారు.

## జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన ప్రవీణ్ రావు

హైదరాబాద్,మార్చి15(ప్రభాత ఉదయం) రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ గా డిటిసి ప్రవీణ్ రావు కు పదోన్నతి లభించింది. రంగారెడ్డి జిల్లా ఉప రవాణా శాఖ అధికారిగా పని చేసి ఇటీవలే హైదరాబాద్ కు బదిలీ అయ్యారు. ప్రవీణ్ రావుకు జేటిసీగా గా ప్రమోషన్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన జెటిసిగా పదోన్నతి పొందిన ప్రవీణ్ రావు కు రాజేంద్రనగర్ సర్కిల్ కు చెందిన జర్నలిస్ట్ వెంకటేష్ శుక్రవారం ఆయన కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.


జే టి సి గా పొందిన ప్రవీణ్ రావు కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జర్నలిస్ట్ వెంకటేష్


ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను తన జన్మదిన సందర్భంగా కలిసిన మంచర్ల శ్రీనివాస్

## శ్రీనివాస్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

శంషాబాద్, మార్చి 15,(ప్రభాత ఉదయం ) బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచర్ల శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థి నాయకుడిగా రాజకీయ ప్రవేశం చేసిన మంచర్ల శ్రీనివాస్ యువత విభాగంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా టిఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠానికి కృషి చేశారు. ఆయన భార్య మమతకు నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కింది. పలు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. టిఆర్ఎస్ పార్టీ. కాంగ్రెస్. బిజెపి నాయకులు ఆయనకు పుష్పగుచ్చాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేడు విద్యుత్ లేని ప్రాంతాలు

రాజేంద్రనగర్, మార్చి15(ప్రభాత ఉదయం ) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రేమవతి పేట భవాని కాలనీ లోగల ప్రావిడెంట్ అపార్ట్మెంట్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు వివిధ మరమ్మత్తుల నిమిత్తం వేస్తున్నట్లు శివరాంపల్లి సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హరినాథ్ చారి తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన ఆదర్శనగర్ మంజుభార్ ఆరంఘర్ పిస్తా హౌస్ రామయ్య హాస్పిటల్ కింగ్స్ శరణ్య లక్ష్మీనారాయణ విలాస్ మెట్రో కన్వర్షన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయాన్ని కి సహకరించగలరని ఆయన కోరారు.



## ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ ఛలో మహేశ్వరం

### మాజీ మంత్రి సబితా రెడ్డి

### భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి రావాలి

మహేశ్వరం, మార్చి15(ప్రభాత ఉదయం) ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్టును నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో శనివారం ఉదయం పదిన్నర గంటలకు మాజీ మంత్రి ,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నాలో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,అనుబంధ సంఘాల నేతలు,కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయగలరని ఎమ్మెల్యే సబితా రెడ్డి పిలుపునిచ్చారు.

# భక్తీ శ్రద్ధలతో ఉపవాస ప్రార్థనలు


బుద్వేల్ లో జరిగిన ప్రార్థన లలో రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్


ప్రార్థనలు

బుద్వేల్, మార్చి15(ప్రభాత ఉదయం) : బుద్వేల్ లో శుక్రవారం రాత్రి దానియేలు - మాధవి ల నివాసంలో ఉపవాస ప్రార్థనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాజేంద్రనగర్ మన్నా చర్చ్ పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ - సిస్టర్ సీహెచ్ ప్రభావతి ల ఆధ్వర్యంలో ఈ ప్రార్థనలు జరిగాయి. గుడ్ ఫ్రైడే సందర్భంగా 40 రోజుల పాటు ఉపవాసముండే క్రైస్తవులు ప్రతి రోజు ఒకరి నివాసం లో ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ నెల 29 న గుడ్ ఫ్రైడే నిర్వహిస్తారు. గుడ్ ఫ్రైడే రోజు యేసు ప్రభువును సిలువ వేస్తారని భావించే క్రైస్తవులు యేసు ప్రభువు సిలువలో పలికిన ఏడు మాటలను ఈ సందర్భంగా ద్యానిస్తారు.

**వెలుగుగా ఉండాలి బీ బ్రదర్ గ్లాడీ :**
యేసయ్య లో జీవిస్తున్న క్రైస్తవులు వెలుగుగా ఉండాలని బ్రదర్ గ్లాడీ అన్నారు. బుద్వేల్ లో జరిగిన ఉప వాస ప్రార్థనలలో ఆయన బైబిల్ సందేశాలను అందచేశారు. కార్యక్రమంలో పాస్టర్ జాన్ వెస్లీ, సిస్టర్ కృపా కుమారీ, డానీ తో పాటు చర్చ్ సభ్యులు, బ్రదర్ దానియేలు కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు: జిల్లా ఎస్పీ రీతిరాజ్

## ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు 20 బారికేడ్స్‌ను అందజేసిన కాసం ఫ్యాషన్ షోరూం యాజమాన్యం






గద్వాల్,మార్చి15(ప్రభాత ఉదయం) జిల్లా కేంద్రం లో ప్రజా రవాణ కు ఏలాంటి ఆటంకాలు లేకుండా ట్రాఫిక్ ను నియంత్రించేందుకు మరిన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు. జిల్లా కేంద్రం లో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవటం జరుగుతుందని అన్నారు . పబ్లిక్ సర్వీస్ లో బాగంగా ట్రాఫిక్ పోలీస్ విభాగానికి కాసం ఫ్యాషన్ షోరూం వారు ముందుకూ వచ్చి 20 ట్రాఫిక్ బారికెడ్స్ ను అందించడం అభినందనీయం అనీ , ట్రాఫిక్ ను నియంత్రించడం లో బాగంగా ట్రాఫిక్ మల్లింపునకు, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ట్రాఫిక్ పోలీస్ విభాగానికి బారికెడ్స్ ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు . అలాగే జిల్లా లో నేర నియంత్రణకు, నేర చెదనకు ఎంతగానో ఉపయోగ పడే సి సి కెమెరాలను మరిన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు ముందుకు రావలసిన అవసరం ఉందని అన్నారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణలో బాగంగా సిసి కెమెరాలు ఎర్పాటు చేసి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ కు అనుసందానించడం జరిగిందని శాంతిభద్రతలకు సంబందించిన నిఘా, భద్రతను పర్యవేక్షించడం తో పాటు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారికి సిసి %జజ% కెమెరాలతో ఆటోమేటిక్ చలాన్లు విధించడం జరుగుతుందని కావున వాహన దారులు ట్రాఫిక్ ఉల్లంఘన చేసి విలువైన డబ్బును వృధా చేసుకోవడమే కాకుండ రోడ్డు ప్రమాదాలకు గురి కావద్దని, అందరూ కూడా ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ ఉల్లంఘించిన వారికి ఆటోమేటిక్ జరిమానాలు జనరేట్ అవుతాయి కావున ట్రిపుల్ రైడింగ్ లో పిల్లలను తీసుకపోతున్నామ, బంధువులను తీసుకపోతున్నామ, ఇతరులను తీసుకపోతున్నామ అనే దానికి మినహాయింపు ఉండదనే విషయాన్ని వాహనదారులు గ్రహించాలని జిల్లా ఎస్పీ రితిరాజ్ అన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని, ట్రిపుల్ రైడింగ్ డ్రైవింగ్ లో నిర్లక్ష్యం చేయవద్దని తెలియజేశారు. వాహనదారులు నో హెల్మెట్స్, సెల్ ఫోన్ వాడకం, ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడం, రాంగ్ రూట్ డ్రైవింగ్ మొదలైన వివిధ ట్రాఫిక్ ఉల్లంఘనలను వంటి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి రోడ్డు ప్రమాదాలకు గురై శిక్షలకు గురికావద్దని వాహనదారులకు ఎస్పీ సూచించారు.

# హౌసింగ్ సోసైటీల పేరుతో జర్నలిస్టులు మోసపోవోద్దు: శ్రీకాంత్ రెడ్డి

**ప్రభుత్వ నిబందనల మేరకే ఇళ్ల స్థలాల కేటాయింపులు ఉంటాయి**

**జర్నలిస్టులు ఎవరూ కూడ ఇలాంటి హౌసింగ్ సోసైటీలకు డబ్బులు చెల్లించవద్దు**

**వెల్లడించిన టీయూడబ్ల్యుజే- హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధ్యక్షులు**



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె శ్రీకాంత్ రెడ్డి, చిత్రంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బాలరాజ్

హైదరాబాద్, మార్చి 15(ప్రభాత ఉదయం) హౌసింగ్ సోసైటీలో సభ్యత్వం తీసుకోకపోతే ఇళ్ల స్థలాలు రావంటూ జరుగుతున్న ప్రచారాన్ని జర్నలిస్టులు నమ్మి మోసపోవద్దని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టియూడబ్ల్యుజె) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధ్యక్షులు శివ శంకర్, కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, గడ్డమీది బాలరాజులు కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ... గ్రేటర్ పరిధిలోని వివిధ నియోజకవర్గాలు, మండలాలలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులను గందరగోళానికి గురిచేస్తూ కొందరు హౌసింగ్ సోసైటీ పేరుతో డబ్బులు వసుళు చేస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. హౌసింగ్ సోసైటీలో సభ్యులుగా నమోదు అయితేనే ఇళ్ళ స్థలాలు వస్తాయని జరుగుతున్న ప్రచారం అవాస్తమన్నారు. ఎవరూ కూడా ఇలాంటి హౌసింగ్ సోసైటీలకు డబ్బులు చెల్లించవద్దని వారు కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో స్పష్టమైన వైఖరిని వెల్లడించనున్నదన్నారు. ఈ మేరకు మీడియా అకాడమీ ఆధ్వర్యంలో అన్ని వర్గాల జర్నలిస్టులతో చర్చలు జరిపి అర్హులైన జర్నలిస్టులందరికి తగిన న్యాయం చేస్తుందన్న నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. హౌసింగ్ సోసైటీల్లో ఉంటేనే ఇళ్ల స్థలాలు వస్తాయనడంలో వాస్తవం లేదన్నారు. ప్రభుత్వ నియమనిబంధనల మేరకే జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు కేటాయిస్తారే తప్ప హౌసింగ్ సోసైటీలో సభ్యులైనంత మాత్రాన అర్హులు కాదన్న విషయాన్ని విజ్ఞులైన విలేకరులు గుర్తించాలన్నారు. గతంలో కూడా ఇలాంటి సోసైటీల పేరుతో డబ్బులు వసూళ్లు చేసి పత్తాలేకుండా పోయిన వారు కూడా ఉన్నారన్న విషయాన్నివారు గుర్తు చేశారు. ఇప్పుడు కూడా గ్రేటర్ పరిధిలో హౌసింగ్ సోసైటీ పేరిట గత ఏడాది సభ్యత్వ నమోదు చేసి తాజాగా మరో మారు అదే విధమైన గందరగోళానికి తెరలేపారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి జర్నలిస్టు వద్ద నుంచి దరఖాస్తుకు రూ.50, సభ్యత్వ నమోదుకు వెయ్యి రూపాయాల చొప్పున వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. జర్నలిస్టులు ఎవరూ కూడా తొందరపడవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నియమనిబందనలను వెల్లడించిన వెంటనే తమ సంఘం ఆధ్వర్యంలోనే జర్నలిస్టులతో చర్చించి అందరికి న్యాయం జరిగేలా చూస్తామని వారు తెలిపారు. అప్పటి వరకు ఎవరు కూడ నూతనంగా వస్తున్న వారికి డబ్బులు చెల్లించి సభ్యత్వాలను తీసుకోవద్దని శంకర్, శ్రీకాంత్‌రెడ్డి, బాలరాజులు కోరారు.

# ఆరు గ్యారంటీలకు ప్రజల్లో నూరు మార్కులు: మేముల శ్రీనివాస్ రెడ్డి

## సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి



కొత్తకోట, మార్చి15(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలకు నేటితో వంద రోజులతో ప్రజలలో నూరు మార్కులు సాధించిందని కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం కొత్తకోట పట్టణంలో పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్లు పథకం కింద ఇంటి స్థలం కలిగిన పేదలకు ఇంటికి ఐదు లక్షల చొప్పున సహాయం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల లోపు లబ్ధిదారులకు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి మహిళల కళ్లల్లో ఆనందాన్ని నింపారు. వైద్య ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితిని రూ.10 లక్షలకు పెంపు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ తో సహా అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలలో ఐదు పథకాలను అమలు చేసి స్వల్ప వ్యవధిలో ప్రభుత్వ పథకాలు పూర్తిచేసిన చరిత్ర ఎప్పుడు లేదు100 రోజుల్లో అమలు చేసి చూపించడంతో ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. 100రోజుల తర్వాత ప్రజలు బాధలు విని నాథుడు దొరికాడంటూ ప్రజలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు. అదేవిధంగా 100 రోజులలో 30 వేల ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగుల ఆశలను ఈ ప్రభుత్వం నిలబెట్టిందన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డ గత ప్రభుత్వానికి పట్టలేదన్నారు. గత ప్రభుత్వ 10 ఏళ్ల పాలనలో దాదాపు రూ 7 లక్షల కోట్ల అప్పులు చేసి ఖాళీ ఖజానాను కాంగ్రెస్ కు అప్పజెప్పి వెళ్ళిపోయిందని తెలియజేసుకుంటున్నాను ఈ సమావేశంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు సంద వెంకటేష్, రైతు సంఘం నాయకుడు ఆనం బాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## పార్లమెంట్ ఎన్నికల్లో
# హైదరా'బాద్ షా' ఎవరో?

హైదరాబాద్, మార్చి 15(ప్రభాత ఉదయం)ఓ వైపు ఓటమి ఎరుగని నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ,మరోవైపు తొలిసారి పోటీ చేస్తున్న మాధవీలత మధ్య పోటీ రసవత్తరం కానుంది.ఎంఐఎం కంచుకోట హైదరాబాద్ లో ఈసారి తప్పకుండా బిజెపి గెలుస్తుందని ఆ పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.తామే గెలుస్తామని ఎంఐఎం నేతలు అంటున్నారు.ఇప్పటికే ఒవైసీ,మాధవీలత ముమ్మరంగా పర్య టిస్తున్నారు.అటు బిఆర్ఎస్-బిఎస్పిఉమ్మడి అభ్యర్థి సహా కాంగ్రెస్ బరిలో ఉండనుండగా ఓల్డ్ సిటీలో నెగ్గేదెవరో చూడాలి.



# ప్రజలు మెచ్చిన నాయకుడు ఎమ్మెల్యే శంకరయ్య

## మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి

కొత్తూరు,మార్చి 15 (ప్రభాత ఉదయం):ప్రజలు మెచ్చిన నాయకుడు యువతకు మార్గదర్శి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య జన్మదిన వేడుకలను షాద్ నగర్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.అనంతరం మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి బోకే పూలమాల శాలువాతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య ను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ...నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేస్తూ ప్రజల అభిమానాన్ని సంపాదిస్తున్నారని మాజీ జెడ్పిటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డి అన్నారు.




# గద్వాల కోట తాయమ్మ అవ్వను దర్శించుకున్న మెగాఫ్యాన్స్

గద్వాల,మార్చి 15(ప్రభాత ఉదయం)శుక్రవారం గద్వాల కోటలో వెలసిన తాయమ్మ అవ్వ ద్యావరను బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు మేదరి శివశంకర్ నిర్వహించిన ద్యావర ఉత్సవాలలో జోగులాంబ గద్వాల జిల్లా మెగాఫ్యాన్స్ అధ్యక్షుడు బోయ జమ్మన్న, మెగా అభిమానులు తాయమ్మ అవ్వను దర్శించుకొన్ని తమ మొక్కలు చెల్లించుకొన్నారు. తాయమ్మ అవ్వ ఆశీస్సులు పొందిన తదితనంతరం విందు భోజనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెగాఫ్యాన్స్ ప్రధాన కార్యదర్శి రఘు,గంజిపేట పరుశరామ్, అయ్యప్ప డిజిటల్ రాము సిద్దు శివ,మహేష్ నాయుడు కృష్ణ కిట్టు నాయుడు గోనెగండ్ల జగదీష్ చిరు వడ్డేకృష్ణ వీరేష్ మెకానిక్ వెంకటేష్ భరత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న గోల్కొండ గ్రామంలోని 100% ఇంటి పన్నులను చెల్లించి ఆదర్శంగా నిలిచిన మాజీ సర్పంచ్ పద్మావతి అనంత రెడ్డి

**100% చెల్లించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన చిన్న గోల్కొండ.**



ఇంటి పన్ను చెల్లింప చేసిన మాజీ సర్పంచ్ పద్మావతి అనంతరెడ్డి

శంషాబాద్,మార్చ్ 15, (ప్రభాత ఉదయం ) 2023 - 24 ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో చిన్న గోల్కొండ గ్రామ తాజ మాజీ సర్పంచ్ గుర్రం పద్మావతి అనంతరెడ్డి గ్రామంలోని 100% ఇంటి పన్నులు చెల్లించి జిల్లాలో ఆదర్శంగా నిలిచారు.. గత గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా గ్రామంలోని ప్రతి ఒక్కరి ఇంటి టాక్సును తానే చెల్లిస్తానని ఇచ్చిన వాగ్దానం మేరకు ఐదు సంవత్సరాలపాటు సర్పంచ్ పనులు చెల్లిస్తూ వచ్చారు. ప్రస్తుతం సర్పంచ్ పదవి కాలం తీరిపోయినప్పటికీ ఇచ్చిన వాగ్దానం మేరకు ఈ ఆర్థిక సంవత్సరం కూడా 100% ట్యాక్స్ లు పద్మావతి అనంతరెడ్డి చెల్లించారు. శంషాబాద్ మండల పంచాయతీ అధికారి ఉషా కిరణ్ రెడ్డి. గ్రామ కార్యదర్శి నాగేష్. కరోబార్ బాబు సమక్షంలో 100% ట్యాక్సును చెల్లించి జిల్లాలో అందరికీ ఆదర్శంగా నిలిచారు. గ్రామంలో 100 శాతం టాక్సు చెల్లించడం పట్ల పంచాయతీ అధికారి పద్మావతి అనంత్ రెడ్డి ని అభినందించారు. గ్రామ అభివృద్ధికి గ్రామస్తులపై ఆయనకున్న ప్రేమ అభిమానానికి ఇదే నిదర్శనం అని పేర్కొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.